క్లుప్తంగా

ఉత్తమ కథా రచయితగా 'భమిడిపాటి'



పురస్కారం అందుకుంటున్న గౌరీశంకర్

శ్రీకాకుళం కల్చరల్: మునసబుపేటలోని గాయత్రీ కళాశాలలో తెలుగు విభాగాధిపతిగా విధులు నిర్వర్తిస్తున్న భమిడిపాటి గౌరీశంకర్‌ను విశాఖకు చెందిన విశాఖ సంస్కృతి పత్రిక ప్రతినిధులు ఉత్తమ కథా రచయితగా పురస్కారంతో ఆదివారం సత్కరించారు. గౌరీశంకర్ జాతీయ స్థాయి హాస్య కథల పోటీలలో ప్రతిభ కనబరచడంతో మాజీ ఎంపీ డి.వి.జి.శంకరరావు చేతుల మీదుగా ఈ పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో శీరెలా సన్యాసిరావు, రామకోటయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి జన్మాష్టమి వేడుకలు



జగన్నాథ సుభద్ర బలభద్రులు

శ్రీకాకుళం కల్చరల్: పొన్నాడ బ్రిడ్జి పక్కన నాగావళి నది ఒడ్డున ఉన్న ఇస్కాన్ మందిరంలో ఈ నెల 15 నుంచి 17 వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు మందిరం నిర్వాహకులు లక్ష్మీధరదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ వివిధ రకాల సేవలు నిర్వహిస్తామని, వివరాలకు 7799747511 నంబరును సంప్రదించాలని కోరారు. అనంతరం మందిరంలో ప్రత్యేక పూజలు, భజనలు, ప్రవచనాలు జరిగాయి.

పీఏసీఎస్ చైర్మన్ల నియామకం



బెవర జగన్నాథరావు



నక్క మురళి

జి.సిగడాం: జి.సిగడాం పీఏసీఎస్ చైర్మన్‌గా మెట్టవలస ఎంపీటీసీ సభ్యుడు బెవర జగన్నాథరావు, డైరెక్టర్లుగా విశ్రాంతి ప్రధానోపాధ్యాయుడు నాగులవలస గ్రామానికి చెందిన పడాల అప్పన్న, విక్రం కామేశ్వరరావులు నియమితులయ్యారు. బాతువ పీఏసీఎస్ చైర్మన్‌గా గెద్దకంచరాం గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది నక్క మురళి, డైరెక్టర్లుగా పోతిరెడ్డి సన్యాసిరావు, రెడ్డి సంతోష్‌కుమార్‌లను నియమించారు. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. వీరిని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అభినందించారు.

రణస్థలం: రణస్థలం ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్‌గా బొంతు విజయ కృష్ణ, మెంబర్లుగా పి.వి.రత్నం, లంక వెంకటరమణ, అలాగే పైడిభీమవరం పీఏసీఎస్ చైర్మన్‌గా దంతులూరి సుశీల, మెంబర్లుగా మీసాల గిరిబాబు, దన్నాన రవీంద్ర, లావేరు పీఏసీఎస్ చైర్మన్ కూనపల్లి దామోదరరావు, మెంబర్లుగా పండి గోపాలరావు, ఇప్పిలి శ్రీనివాసరావులు నియమితులయ్యారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



ఎడ్లబండ్ల ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం: రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఆదివారం జి.సిగడాంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా ఎడ్లబండ్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాలకు పందిరిరాట



లక్ష్మీగణపతి ఆలయం వద్ద ముహూర్తపు రాట వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మెుండేటివీధిలో లక్ష్మీగణపతి ఆలయం వద్ద వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం పందిరిరాట వేశారు. ఈ నెల 27నుంచి సెప్టెంబరు 4 వరకు ఉత్సవాలు జరగనున్నాయని, భక్తులంతా పాల్గొనాలని షిరిడీ సాయి సేవా సంఘం సభ్యులు కోరారు.

శ్రీకాకుళం/శ్రీకాకుళం కల్చరల్: ఇలిసిపురం రైతుబజారు కూడలిలో వినాయక ఉత్సవాల నేపథ్యంలో కేఎస్ఎస్‌వి ప్రసాద్ దంపతులు నేతృత్వంలో పందిరిరాట వేశారు. 11 రోజులు పాటు వివిధ కార్యక్రమాలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అప్పి, వాసు, చక్రవర్తి, సుకుమార్, భరత్, శ్రీధర్, విఘ్నేష్, కార్తీక్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో కొత్త పనులు

- పండ్ల తోటలు, నీటి కుంటలు, కందకాల తవ్వకానికి ప్రాధాన్యం
- ఆసక్తి గల రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరణ
- అన్నదాతలకు అండగా కేంద్ర ప్రభుత్వం



కొండములగాం సమీపంలో భూగర్భ జలాలు పెంపునకు తవ్విన కందకాలు

రణస్థలం: అన్నదాతలకు కేంద్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా శాశ్వత ఫలసాయం దక్కేలా ప్రత్యేక కార్యచరణ రూపొందించింది. ఇప్పటికే ఉపాధి పనులకు మంచి ఆదరణ ఉండగా రైతన్నల నుంచి దరఖాస్తులు స్వీకరించి సరికొత్త పనులకు శ్రీకారం చుడుతోంది. పచ్చదనమే ప్రధానంగా ఉపాధి హామీ సిబ్బందికి శిక్షణ ఇచ్చి క్షేత్ర స్థాయిలో రైతులకు సహాయం అందించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. అటు రైతులకు, ఇటు వేతనదారులకు నిత్యం లబ్ధి చేకూరేలా పండ్ల తోటల పెంపకం చేపట్టి తద్వారా రైతులకు ఆర్థిక సహాయం అందించేలా కార్యాచరణ రూపొందించింది. కందకాలు తవ్వడం వల్ల భూగర్భజాలాలు సైతం పెరగనున్నాయి.

మొక్కల పెంపకంతో అదనపు ఆదాయం..

పొలాల గట్లపై మొక్కల పెంపకం, చెట్ల చుట్టూ కందకాల(ట్రెంచ్‌లు) తవ్వించడం వంటి పనులకు ఉపాధి పథకం ద్వారా నిధులు చెల్లిస్తున్నారు.ఈ పనుల ద్వారా రైతులకు అటు పొలాల వద్ద చెట్లను సంరక్షించుకునే అవకాశంతో పాటు రూ.17వేల వరకు వేతనం లభిస్తుంది. మరోవైపు ఈ కందకాలతో చెట్టుకు నీటి సదుపాయం కలుగుతుంది. మూడు ఎకరాలున్న రైతులు తమ మెట్టు ప్రాంత పొలాల్లో నీటి కుంటలు తవ్వుకునేందుకు నిధులు కేటాయిస్తున్నారు. 9 మీటర్ల వెడల్పు, 9 మీటర్ల పొడవుతో పాటు రెండు మీటర్ల లోతు తప్పనిసరిగా తవ్వాలి. వీటికి రూ. 50 వేలు వరకు అందజేస్తారు. ఈ ఏడాది రణస్థలం మండలంలో సుమారు 50 ఎకరాల్లో సుమారు 40 మంది రైతులు కొబ్బరి మొక్కలు నాటారు.

తోటల పెంపకానికి ప్రోత్సహకాలు..

న్యూస్ట్రాటజీ పనుల్లో భాగంగా రైతుల తమ పొలాల్లో పండ్ల తోటల పెంపకం చేపడితే ఉపాధి పథకం ద్వారా ప్రోత్సాహకాలు అందిస్తారు. ఉద్యానవన అధికారులచే 14 రకాల పండ్ల మొక్కలను రైతులకు ఉచితంగా ఇస్తారు. ఆసక్తి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు ఎకరాలకు 60 నుంచి 70 వరకు మొక్కలు అందిస్తారు. వీటిని మూడేళ్ల పాటు పెంపకానికి రూ.97వేలు వరకు ఉపాధి పథకం ద్వారా పనులు అందిస్తారు. మూడేళ్ల అనంతరం ఫలసాయాన్ని రైతులే పొందవచ్చు.



కోష్టలో కొబ్బరితోటలో తవ్విన కందకాలు



కోష్టలో కొబ్బరిచెట్ల చుట్టూ తవ్విన కందకాలు

రైతులకు ఉపయోకరం

ఎస్ఆర్ఈజీఎస్ పనుల ద్వారా కొబ్బరి మొక్కల పెంపకానికి ఉపాధి హామీ వేతనదారులతో కందకాలు తవ్వించడం రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. మొక్కల ఎదుగుదలకు మూడేళ్ల పాటు సంరక్షణ కల్పిస్తూ ప్రోత్సాహకాలు ఇవ్వడం సంతోషంగా ఉంది.

– కరిమజ్జి రాము, కోష్ట పంచాయతీ, రణస్థలం మండలం

భూగర్భజలాలు పెంపు..

రైతులకు, వేతనదారులకు ఈ పథకం ఎంతో ఉపయోగకరం. అలాగే భూగర్భ జలాలు పెంపునకు దోహదపడతాయి. కందకాల తవ్వకానికి నిధులు కేటాయిస్తున్నాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. న్యూస్ట్రాటజీ పనుల్లో భాగంగా పండ్ల తోటలు, కొబ్బరి మొక్కల పెంపకానికి అవకాశం కల్పిస్తున్నాం.

– ఎం.శ్రీనివాసనాయుడు, ఉపాధి ఏపీవో, రణస్థలం

చంద్రబాబువన్నీ బూటకపు హామీలే



కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): చంద్రబాబునాయుడి రాజకీయ జీవితమంతా అబద్ధాలు.. అన్యాయాలు.. అక్రమాలేనని వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పథకాలతో పాటు సూపర్‌సిక్స్‌పేరిట మరో ఆరు పథకాలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు మరోసారి బూటకపు హామీలతో ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. ఏ ఇంటికి వెళ్లినా బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ అని వెనుకా ముందు ఆలోచించకుండా చెబుతున్నారన్నారు. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదేశాల మేరకు శ్రీకాకుళం నగరంలోని 47, 48, 49వ డివిజన్ బలగలో పార్టీ నగర అధ్యక్షుడు సాదు వైకుంఠరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నింటిపైనా బాదుడు వేస్తున్నారన్నారు. నిత్యావసర సరుకులు మొదలుకుని విద్యుత్, పెట్రోలు, ఇంటి పన్నులు ఇలా అన్ని ఇష్టం వచ్చినట్లు భారం మోపి తీవ్ర అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమ పథకాలు ఈ చేత్తో ఇస్తున్నారు.. ఆ చేత్తో లాగేసుకుంటున్నారని దుష్ప్రచారం చేశారన్నారు. కూటమి పాలనలో ఈ చేత్తో ఇవ్వడం లేదు కానీ ఆ చేత్తో ఇష్టం వచ్చినట్లు లాగేస్తున్నారని విమర్శలు బలంగా వినిపిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, ఎన్ని ధనుంజయరావు, పట్టణ బీసీ విభాగం అధ్యక్షుడు గద్దిబోయిన కృష్ణారావు, గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు రౌతు శంకరరావు, పొన్నాడ రుషి, అల్లు లక్ష్మీనారాయణ, సీపాన రామారావు, గోవింద, ఎంఏ బేగ్, కె.తేజ, యడ్ల వెంకటి, నాగరాజు, యండ రమేష్, సత్యనారాయణ, శాంతారావు, కింజరాపు రమేష్, వానపల్లి రమేష్, బైరి మురళీ, హరి, శ్రీనివాస్, చందు, తోట తారక్, తంగి అప్పన్న, రంగాజీ దేవ్, శాంతారావు, సీపాన మహేందర్, చామర్తి భాస్కర్, అలపాన త్రినాథ్ రెడ్డి, ఖాన్, సత్యనారాయణ, భానుప్రసాద్, సురేంద్ర, మెహర్ గాంధీ, రుప్ప శేషగిరి, గాంధీ, సత్యనారాయణ, అప్పలరాజు, చీమల తారక, చక్రవర్తి, శ్రీను, ఈశ్వరరావు, పాపారావు, కన్నా బాబు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా కాలువ

శ్రీకాకుళం నగరంలో ఇలిసిపురంలో భద్రమ్మ గుడి వీధి నుంచి సానావీధిలోకి వచ్చే దారిలో కాలువలో ఎప్పటికప్పుడు చెత్త పేరుకుపోతోంది. దీంతో మురుగునీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకున్నవారే కరువయ్యారని స్థానికులు చెబుతున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)



హైవేపై అంధకారం

జాతీయ రహదారిపై వంతెనలపై ఏర్పాటు చేసిన లైట్లు వెలగక వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కింతలి మిల్లు, ఎచ్చెర్ల బైపాస్, అరిణాం అక్కివలస, శ్రీకాకుళం ముఖద్వారం తదితర ప్రాంతాల్లో ఒక రోజు లైట్లు వెలిగితే మరుసటి వెలగడం లేదని వాహనచోదకులు చెబుతున్నారు. అంధకారం నెలకొనడంతో ప్రమాదాలు జరిగే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు.



– రణస్థలం

ఎరువులు అందించకపోవడం ప్రభుత్వ వైఫల్యమే



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు. పక్కనే ఎంపీపీ రఘురామ్

గార: రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు, పెట్టుబడి సాయం అందించకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. గార మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎరువుల సమస్య లేదని, విత్తనాలు, పెట్టుబడి సాయం సకాలంలో అందించినట్లు గుర్తు చేశారు. సూపర్ సిక్స్ పేరుతో హడావుడి చేయడం తప్ప హామీల అమలులో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ప్రజాప్రతినిధులు చెప్పిన అంశాల మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని, మీ పరిధి మించినవి ఉన్నతాధికారులకు తెలియజేసి అందరూ కలసి సమస్య పరిష్కరించాలని కోరారు. స్థానిక సంస్థల పటిష్టతకు ప్రభుత్వం చర్యలు చేపట్టేలా ఎమ్మెల్సీ దృష్టి సారించాలని ఎంపీపీ రఘురామ్ కోరారు. రాజ్యాంగ విరుద్ధంగా గ్రామ స్థాయిలో కూడా విభేదాలు సృష్టించే పరిస్థితి కూటమి పాలనలో దాపురించిందని, దీనిపై శాసన మండలిలో చర్చించాలని కోరారు. గార సర్పంచ్ మార్పు దుర్గా పృథ్వీరాజ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీలో నిధులు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. విద్యుత్ బిల్లులు, పారిశుద్ధ్య బిల్లులు ఇవ్వలేని పరిస్థితి లేదన్నారు. భూములు కొనుగోళ్లు ద్వారా స్టాంపు డ్యూటీ రావడం లేదని, ఇసుక ర్యాంపు వల్ల పంచాయతీలకు ఆదాయం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువులను ఆర్ఎస్‌కేల ద్వారా పంపిణీ చేసినప్పుడే రైతులకు అందుతోందని కొర్లాం సర్పంచ్ పీస శ్రీహరిరావు అన్నారు. బైరిదేశిగెడ్డ శివారు ఆయకట్టుకు సాగునీరందించాలని కోరారు. రాయితీ పశుదాణా కూటమి కార్యకర్తలకే అందుతోందని, అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా చూడాలని కొర్ని సర్పంచ్ పీస గోవిందరాజులు కోరారు. అంపోలు, సతివాడ, కె.సైరిగాం పరిధిలోని బైరిదేశిగెడ్డ నుంచి అతివృష్టి, అనావృష్టి సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని సర్పంచ్ గొండు జయరాం తెలిపారు. వత్సవలస, తండ్యాలపేట ప్రాంతాలకు ఈ ఏడాదైనా సాగునీరందించాలని, వత్సవలస త్రీఫేజ్ విద్యుత్ సమస్య పరిష్కరించాలని సర్పంచ్ తెలుకోటి అప్పారావు కోరారు. సమావేశంలో తహశీల్దార్ ఎం.చక్రవర్తి, ఎంపీడీవో ఎ.రఘు, అందవరపు బాలకృష్ణమూర్తి, అరవల రామకృష్ణ, గొలివి వెంకటరమణమూర్తి, తమ్మిన అప్పలరాజు, కొయ్యాన నాగభూషణం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఉపనిషన్మందిరంలో ఆధ్యాత్మిక ప్రవచనం



వక్తను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఉపనిషన్మందిరంలో చరమోపాయం అనే అంశంపై వక్త సనపల నారాయణమూర్తి ఆదివారం ఆధ్యాత్మిక ప్రవచనాలు చెప్పారు. మోక్షమార్గాన్ని వైష్ణవ సంప్రదాయంలో ఉపాయమంటారని పేర్కొన్నారు. సర్వధర్మాలను పరిత్యజించడం మోక్షానికి మార్గమని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు నిక్కు అప్పన్న, పెంట కార్తికేయశర్మ, బలగ తాడు, విశ్వేశ్వరరావు, మోహనరావు, బాబూరావు, జోగారావు, చంద్రరావు, సరస్వతి, వెంకటలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు అదుపులో జ్వరాలు



జ్వరాలపై ఆరా తీస్తున్న డీపీఓ(ఫైల్)

జి.సిగడాం: మండలం టి.డి.వలసలో జ్వరాలు ఎట్టకేలకు అదుపులోకి రావడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. సుమారు 50 రోజులపాటు జ్వరాల కారణంగా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు, వైద్యసిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి జ్వరాలను అదుపులోకి తీసుకువచ్చారు. గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి సత్వర వైద్యసేవలు అందించారు. ఐదు బృందాలుగా ఏర్పడి ఇంటింటా సర్వే చేసి జ్వర పీడితులను గుర్తించారు. వైద్యాధికారులు బుడుమూరు యశ్వంత్, పేకల సుమబిందు ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యసేవలు అందించారు. ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి అసిరయ్య పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించారు. ఏఎన్ఎం వనజాక్షి, ఎంఎల్‌హెచ్‌పీ దివ్యరాజేశ్వరి తదితరులు సేవలందించారు.

ఆదిత్యుని సన్నిధిలో..

శ్రావణ మాస సందడి



ఆదిత్యుని ఆలయం వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై భక్తులు



అన్నప్రసాదాలను స్వీకరిస్తున్న భక్తులు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం శ్రావణమాస సందడి కనిపించింది. ఆరోగ్య ప్రదాతగా కొలువుతీరిన ఆదిత్యున్ని దర్శించుకునేందుకు ఇతర జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. శ్రావణ మాస ప్రత్యేకంగా మూలవిరాట్టును తులసీ గజమాలలతో అలంకరించారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో దాతలకు, ప్రత్యేక అంతరాలయ దర్శన టిక్కెట్లు భక్తులకు మాత్రమే అంతరాలయంలో దర్శనం చేయించారు. ఉదయం 5.30 గంటల నుంచే స్థానికులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు ఉన్నతాధికారులు, ఇతర జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు ఆదిత్యున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు.

తప్పని అవస్థలు..

ఆదిత్యుని దర్శనానికి వచ్చిన భక్తులకు అవస్థలు తప్పలేదు. ఓ వైపు ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో విలవిలలాడిపోయారు. పలుచోట్ల టెంట్లు వేసినా పూర్తిస్థాయిలో సౌకర్యవంతం కాలేకపోయాయి. ఉదయం 11 గంటల తర్వాత కూడా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఎండల్లో అవస్థలు పడ్డారు. పుష్కరిణి ఎదురుగా ప్రత్యేక దర్శనానికి, ఉచిత దర్శన మార్గాల్లో భక్తులు ఎండలోనే బారులు తీరారు. పలువురు భక్తులు ఆరోగ్యం కోసం సూర్యనమస్కారాల పూజలు చేయించుకున్నారు. కేశఖండన శాలలో క్షురకులు అదనపు వసూళ్లకు పాల్పడటంపై భక్తులు ఫిర్యాదులు చేశారు. అన్నప్రసాదాల నిర్వహణ వద్ద పరిస్థితి అధ్వానంగా ఉండటంతో పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. వీఐపీ దర్శనాలంటూ కొందరు దళారీలు వసూళ్లకు పాల్పడటం సిబ్బంది దృష్టిలో పడింది.



ఎండలో బారులు తీరిన భక్తజనం

16న శ్రీకృష్ణ వేషధారణ పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో భాగంగా ఈ నెల 16న చిన్నారులకు శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నట్లు మిమిక్రీ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బొంతావారి వీధిలోని కృష్ణార్జున మందిరంలో సాయంత్రం 6 గంటలకు పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. 4 నుంచి 8 ఏళ్ల జూనియర్స్ విభాగంలో, 8 నుంచి 10 ఏళ్ల లోపు చిన్నారులు సీనియర్స్ విభాగంలో పోటీలో పాల్గొనాలని కోరారు. వివరాల కోసం 9441072762 నంబరును సంప్రదించాలని కోరారు.

విశ్వబ్రాహ్మణ సంఘ కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుజరాతీపేటలో బ్రహ్మంగారి కోవెలలో విశ్వబ్రాహ్మణ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. సంఘం అధ్యక్షుడిగా నాదేళ్ల భార్గవ, కార్యదర్శిగా అలుగోలు కోటేశ్వరరావు, కోశాధికారిగా అలుగు గోపి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో గుజరాతీపేట, హయాతినగరం, ఫాజుల్‌బాగ్‌పేట, పీఎన్ కాలనీ, నీలమ్మకాలనీ, అరుణమ్మ కాలనీ విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా శంకరంబాడి జయంతి



శంకరంబాడి సుందరాచారి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: నగరంలో హడ్కోకాలనీ శాఖా గ్రంథాలయంలో ఆదివారం సాహితీ చైతన్య కిరణాలు, బాల కథా నిలయం ఆధ్వర్యంలో 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' గేయ రచయిత శంకరంబాడి సుందరాచారి 112వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేన్ మట్లాడుతూ సుందరాచారి రచించిన మా తెలుగు తల్లికి మల్లెపూదండ తెలుగు భాషకు వన్నెతెచ్చిందన్నారు. సాహితీ చైతన్య కిరణాలు అధ్యక్షుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సుందరాచారి ప్రసన్న కవిగా బిరుదు పొందారని పేర్కొన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత, నడుకురు శ్రీను తదితరులు పాల్గొన్నారు.